# ఇంటికి ఇల్లాలు

బద్ధకంగా ఒళ్ళు విరచుకొని, కనులు తెరచి చూశాను . . . . ఎదురుగా గోడకు వ్రేలాడదీసిన మా పెళ్ళినాటి ఫోటోలో చిట్టి, వ్రీడాభరంతో, బుగ్గన కాటుకతో ప్రత్యక్షమైంది.

సూర్యరశ్మి కిటికీ వూచలనుంచి, సూటిగా వచ్చి గది మధ్యలో పడుతూంది.

శ్రీమతిగారి పెంపుడు పిల్లి(గారు) ప్రొద్దుట పూట పూజను కనులు మూసుకొని, సూర్యరశ్మిలో తదేకనిష్ఠతో చేస్తోంది.

శ్రీమతిగారు లోన అంట్లు తోముతున్నట్లుంది.

ఆవులించి, ఒళ్ళను మరోమారు విరచుకొని, దుప్పటిని తొలగింపబోయి, మరోమారు ఒత్తిగిలి పరుండాను. ఈమధ్య పత్రికల్లో, ఎక్కడ చదివిందో కానీ, మా శ్రీమతికి 'పొదుపుఉద్యమం' బాగా ఒంటపట్టినట్లుంది.

దానికి మొదటి మెట్టులా, పనిమనిషికి రిట్రెంచిమెంటు (తొలగింపు)ఆర్డరు జారీచేసి, తానే ఆ పనులకు ఉపక్రమించింది.

మొదటి దినము ఆ విషయంపై, నేను ఎంతో చర్చించి, కడకు కోపగించుకొన్నాను కూడ.

“మీకు తెలీదులెండి ! చదువుకొన్న పిల్లలు మ ఇంటిపనులు చేసుకోకూడదని, ఏదైనా శాసనం వుందా !'' అంటూ చిరునవ్వుతో తేలికగా, తేల్చివేసింది.

పెళ్ళికాకమునుపు, వారి ఇంటిలో చీపురుపుల్ల అటుదీసి ఇటు పెట్టటానికి ససేమిరా అనేది ఈ ఆరునెలల్లోనే ఇలా పూర్తిగా మారిపోవటం చూసి, మొన్న వచ్చిన అక్కయ్య విస్తుపోయింది.

నన్ను చాటుగా పిలిచి, “ఏవిట్రా ! ఎంతగా పిచ్చిపిల్లయి,నీ మాట అది వింటున్నా, ఆ పసిపిల్ల చేతనట్రా ఆచాకిరి అంతా చేయించేది. నీఅంత చదువు చదివిన పిల్ల . . . . అందులో గొప్పింటి పిల్ల . . . . గారాబంగా, వాళ్ళింట్లో ఏ పనీ చేయనిచ్చేవారు కాదు. కనీసం కసవు వూడ్చేందుకు, ఆ పాత్రలు తోమేందుకైనా పనిపిల్లను పెట్టుకోంటేనేం ! !'' అని చాటుగా మందలించింది.

నేను చిరునవ్వును జవాబిచ్చాను ...

ఈ సంగతులన్నీ నాకు తెలియకకాదు.

చిట్టి శ్రీమంతుల పిల్ల. బి.ఏ. వరకు చదువుకున్నది. నేనో 150 రూపాయల నెలసరి ఆదాయం గల గుమాస్తాగిరి వెలిగించే వ్యక్తిని.

కానీ, చిట్టి నన్ను ప్రేమించినదంటే, నాలో ఏ గొప్పతనం చూసి ప్రేమించిందో నా కీనాటికీ గోచరం కాదు. !

వాళ్ళ వాళ్ళందరూ కాదన్నా ససేమిరాఅని .... అందరినీ ఎదిరించి, నన్ను వివాహమాడిన ఉదంతం ఏనాటికీ మరచిపోలేను.

చిట్టి పువ్వుల్లో పెరిగిన పిల్ల !

పాయసంతో ఎదిగిన అమ్మాయి ...!

నా ఆఖరి రక్తకణం ఇచ్చిఅయినా నా చిట్టిని ఆ పువ్వుల్లోనే వుంచదలచాను.

## ప్రఫుల్లారాణి

కానీ . . . .

నేను ఈ విషయాలను ఎత్తగనే నునుసిగ్గుతో “చాల్లెండి ! మీరు కథల్లో అలా వ్రాసుకోండి! ఇది సంసారం. మా అమ్మగారు శ్రీమంతులైతే నాకేం ! నా సంసారాన్ని చక్కబెట్టుకొనేవిషయం నాది ! మీ రిక ఇలాంటి విషయాలెత్తితే నే నూరుకోను...జాగ్రత్త!!'' అంటూ లాపాయింట్ వేసి, నన్ను అవలీలగా విదిల్చిపారవేస్తుంది !!

పెళ్ళికాకమునుపు, వాళ్ళ అమ్మ బెడ్‌కాఫీ పట్టుకవచ్చినా, 8గంటలవరకు ఆవులిస్తూ కళ్ళు తెరవక ముసుగుతన్ని పడుకొనేది ! “అలాంటి పిల్లతో నీ వేం సంసారం చేస్తావో''అని పెళ్ళికాక ముందు అక్క నన్ను పరిహాసం చేసింది.

కానీ, ఆ చిట్టే ఈ దినాల్లో 4 గంటలకే లేచి, కసవు వూడుస్తుంది అంటే, అందరూ విస్తుపోతారు . . . .

ఈమధ్య ఐదు దినాల వెనుక తానే గుడ్డలు ఉతుకుతాననే ప్రతిపాదన తీసుకవచ్చింది.

నిజానికి నాకు అలవిమాలిన కోపం వచ్చింది.

కడకు, ఏమైతేనేం, కోర్టువారే నెగ్గారు. అప్పటినుంచి రాత్రిపూట పడుకొనబోయేముందు నా గుడ్డలను, తన చీరలను సన్‌లైట్‌తో ఉతకటం, అలవాటు పెట్టుకుంది.

మాటాడను నోరువిప్పితే, చిరునవ్వుతో చిరుకోపం అభినయిస్తూ, నావేపు చురచురచూస్తూ, “ఇది నా సంసారం !'' అని ఒక్కమాట ఖచ్చితంగా అనివేయటం నేర్చుకుంది.

గత మాసంలో బడ్జెట్ సమావేశంలో, తన పొదుపు ఉద్యమం ఎంతవరకు పనిచేసిందో అంకెల మూలకంగా నిరూపించగానే, నేనూ విస్తుపోక తప్పింది కాదు.

నెలకు ఆ దినాల్లో 150 రూపాయలు కర్పూరంలాహరించుకపోయి, ఎప్పుడూ సెంట్రల్ గవర్నమెంట్ బడ్జెట్‌లా భారీగా లోటుకనిపించేది.

కానీ, ఆర్థికశాఖను శ్రీమతి చిట్టి, బి. ఏ. గారు చేజిక్కించుకొన్నప్పటినుంచి, పకడ్‌బందీగా జమాఖర్చులు తేలటం, ఖర్చులకు ఎక్స్‌ప్లనేషన్‌లు ఇచ్చుకోవటం..దానిపై సివియర్‌వార్నింగ్స్ ఇవ్వటం వీటిమూలకంగా గత మాసం బడ్జెట్‌లో 55 రూపాయలు మి[illegible]లు కనపరచింది !

* * *

అసలు విషయానికి రావటం మంచిదంటారు కదూ !

ఆఁ..ఆవులిస్తూ, లేవబోయి, మరోమారు కునుకువేయ బుద్ధిపుట్టింది.

శ్రీమతిగారి గాజుల శబ్దం మధుర విపంచీ నాదంలా వినిపిస్తుంది . . . . .

“శ్రీమతి గారూ....!'' పడకపై కూర్చొని చిట్టికోసం కేకవేశాను.... ఒక్క పిలుపుతో శ్రీమతిగారు వస్తే ఇకనేం...! నా కో దండకం ఉంది లెండి... అవన్నీ పూర్తిగా నేను పారాయణం చెయ్యాలి... అప్పటికి కానీ కదలిరారు శ్రీమతిగారు....!

“శ్రీమతిగారూ.....!'' గాజుల శబ్దం వినవస్తుంది కాని తాను నోరు విప్పదు....

“హర్ హైనెస్ చిట్టీశ్వరీ దేవిగారూ...!'' జవాబు రాదు

“సోనేకీ చిడియా....(బంగారు పిట్ట)....!''

“విరికన్నెల వన్నెల చిన్నెల చిన్నదానా...!'' రాగయుక్తంగా పాడాలి....! అప్పటికీ కదలి రాదు... తనలో తాను చిరునవ్వు నవ్వుకొంటుంది.

“సవరంపాడు కృష్ణప్పనాయుడు ముద్దుల మూడో కూతురు....!'' ఆగ్రహంతో సహా కేక వేస్తాను...

“ఓ ఆవిడగారు.... శారదాంబగారూ....!'' ఇదీ శ్రీమతిగారి ఎస్. ఎస్. ఎల్. సర్టిఫికెట్టులోని అసలైన సిసలైన పేరు.

“ఏయ్ మిస్టర్......!''

“అరే.... చిట్టిబ్బాయ్.... నిన్నే పిలిచేది..!''

“ఏయ్.... చిట్టిపిల్లా... చెవుల్లేవా....!''

.....ఇక విసుగురాక ఏం చేస్తుంది.. చెప్పండి

కడపటి అస్త్రం ఉన్నదే ఉందిగా......

పెద్దగా గది మారు మ్రోగేట్లు....

“ఏయ్....! పొట్టిముక్కు....!'' .......

“ఏయ్.... నల్లపిల్లా....!''... కేకలువేస్తాను.

తడిచేతిని కొంగుకు తుడుచుకుంటూ శ్రీమతిగారు గుమ్మం వద్ద ప్రత్యక్షమైంది

చిరునవ్వును పెదవులపై నొక్కుకుంటూ చిరుకోపాన్ని చిన్ని నొసటపై ముడుతలువేస్తూ.

"అబ్బబ్బ! ఇకనైన ఆపండి! ఎవరైన వింటే నవ్వుకొంటారు......!" కొంగును నడుముకు బిగించుకొని బిగువైన రొమ్ము పైకి పైటను మరికొద్దిగా లాగుకొంది.....

"మరి మర్యాదగా పిలిచినపుడు తమరుగారు వచ్చియుంటే తమ పాదాలు ఏవీ అరిగిపోవుగా అమ్మాయిగారూ!...." కొంటెగా చూస్తూ, జవాబిచ్చాను.

"ఆఁ ఇక అయినట్లే! మీతో మాట్లాడేందుకు కూర్చుంటే, ఇక ఇంటి పనులు అయినట్లే! కాఫీనీళ్లు పొయ్యిమీద పెట్టివచ్చాను. ఏదో ఒకటి చెప్పండి... ఇంతకూ ఎందుకు పిలిచినట్లు... ?" ప్రశ్నార్థకంగా నావేపు చూసింది, విసుగు నభినయిస్తూ......

"ఈ మంచానికి కూడా నల్లులు ఎక్కినట్లున్నాయి... రాత్రి అంతా నిద్రలేదు...!" ఏదో ఒక వాక్యం పలకకపోవటం బాగుండదని చెప్పాను.

"మధ్యాహ్నం ఎండలో వేస్తానులెండి..... అంతేనా?" అంటూ గిరుక్కున గుమ్మం వద్ద నుంచే వెనుతిరిగింది.

"ఏయ్.... ఇట్లారా! నిన్నే చిట్టీ! నా మాట అబద్ధం అనుకున్నావుకదా....! ఆ ఇదిగో... చూస్తున్నావా... ఎంత పెద్దనల్లి...!" ఆ ఇలారా!

పడకపై తప్పించుకొన్న నల్లిని వెదకసాగాను......

పాలుత్రాగిన పిల్లినైనా ఉదారంగా వదిలేస్తుందిగానీ శ్రీమతిగారు పడకపై తప్పించుకున్న నల్లిని ఏమాత్రం కనికరించదని నాకు పూర్తిగా తెలుసు .....!

చిరచిరా పడక వద్దకు వచ్చి తాను తీవ్రంగా వెదుక సాగింది.

దుప్పటిని విదిలించింది. చేతుల గాజులు గల్లుమనటం, రొమ్ము ఎగిసి పడటం...... తాపీగా కూర్చొని పరిశీలింప సాగాను... శ్రీమతిగారి ముంగురులు నా నొసలును స్పృశించాయి.

"ఇదిగో....నల్లి...ఇక్కడ...!"

ఉలిక్కిపడినట్లు "ఎక్కడండీ" అంటూ నా తలకు తన చెక్కిలిని మరింత దగ్గరకు తెచ్చి, వెదుక సాగింది.

".....ఇదిగో... ఇక్కడ...!"

అంటూ అనుకున్న ప్లాను ప్రకారం చిట్టి చెక్కిలిని పెదాలతో స్పృశించాను......!

ముద్దిడి, ఫక్కుమని నవ్వగానే, నేను జరిపినదంతా నాటకమని చిట్టి గ్రహించి— సిగ్గుతో కుంచించుక పోయింది.

"చాల్లెండి....! ఇందుకా యీ నాటకం...! అబ్బబ్బ! నానాటికీ పిల్లాడికన్నా చిన్నవాళ్లయి పోతున్నారు....!" అంటూ విసవిస లోనికి వెళ్లింది....!!

"ఏమండీ.... ఇంకా ముస్తాబుల్లోనే ఉన్నారన్నమాట. మీరు ముస్తాబు పూర్తి చేసుకుని పోయేలోగా ఆ వచ్చే ట్రెయిను ఎలాగూ వచ్చిపోయి ఉంటుంది. మీరు పోయి ఆ ఖాళీ ప్లాటుఫారాన్ని కొలతలు వేసుకొని రావల్సిందే......!" అంటూ కాఫీగ్లాసు తెచ్చి టేబిల్‌పై పెట్టూ, మరోమారు హెచ్చరించింది. ఇది నాలుగోమారనుకుంటాను హెచ్చరించటం. ఇంతకూ విశేషం సదరు ఆ దినం శ్రీమతిగారి ముద్దుల చెల్లాయిగారు వేంచేయ బోతున్నారు....! ఆవిడగారిని ఆహ్వానించేందుకు నేను ట్రైనువద్దకు వెళ్లటం తప్పదని నాకు తెలుసు.....

"తమరి చెల్లెలు గారు ఏం బుజ్జి పాపాయి కాదులే మిస్టర్.... తప్పించుక ఏం పోదు....! టిక్కెట్టు లేకుండా ఇండియాఅంతా చక్కర్ కొట్టుక వస్తుంది.....! ఏం ఫరవాలేదు... అంతగా ఒంటరిగా వచ్చినా ఎవరూ ఎత్తుక పోరు.... కావాలంటే ఎవరూ ఎత్తుకపోరని నేను హామీ ఇస్తాను.... ఆ ముద్దిమానుల్లాంటి శరీరం, రోడ్డురోలరు లాంటి ఆకారం, ఆ నీల గగన శ్యామవర్ణం ... యీ సులక్షణాలను కలిగిన తమ చెల్లాయి ముద్దుల మోహనరూపాన్ని చూసి, కొంపదీసి ఎవరైనా ప్రేమించినా బహుశా వాడు పుట్టిగుడ్డియై యుంటాడు. ఫరవాలేదు....! ఏం తప్పించుక పోదులేవోయ్!"

అప్పటికే మూతిని మూడు వంకర లేం, సవాలక్ష వంకరలు త్రిప్పింది శ్రీమతిగారు.

"మీరు పోకున్నా పుణ్యమాయె, తమరేం సర్టిఫికెట్టు ఇవ్వ పనిలేదులెండి.... తమకన్న మంచివాడే దొరుకుతాడు మా రాజ్యానికి! ఇంతకూ మీరు వెళ్తారా... లేక... !"

చురచుర చూసింది...

కాఫీని త్రాగడం పూర్తిచేసి.. లేచాను...

"కోపమేలనే భామినీమణీ! ఇదియే నీదు ఆజ్ఞను శిరసావహించువాడ! నీదు ముద్దుల చెల్లియ యీ భూనభోంతరాళమున ఎక్కడనైన ఉండనీ, ఎవరెస్టు శిఖరంబున కానీ, మల్లయ్య హోటలునందుకానీ, మంగలి షాపు నందుండనీ.... కొని తెచ్చెదను... దీవించి పంపవే మగువ మాంచాలా!"......

అంటూ చిట్టి బుగ్గ గిల్లబోయాను.....

"చాల్లెండీ! మీరూ, మీ నాటక ధోరణి! ఆ సినిమాల్లోనైనా చేరియుంటే సరిపోయి యుండును.....!" అంటూ చిరుకోపం తెచ్చుకుంటూ, మెచ్చుకుంది.

"సినిమాల్లో చేరాలని మద్రాసుకు పోవాలనుకొన్నాను. కానీ పాపం ఆ నాగేశ్వర్రావుకు పోటీతగలటం ఇష్టంలేక, ఇంట్లో జమునల్లాంటి హిరోయిన్‌ను ఉండటంచేత, ఆ ప్రయాణం విరమించుకొన్నాను. . !"

"మరి ఈ ప్రయాణంకూడ విరమించుకొన్నారన్నమాట! వసపోసిన పిట్టలాగా! చాల్లెండి! ఇకనైనా వెళ్తారా లేదా . . !" . . .

అంటూ అలా చూపువిసరి, ఇలా జడ రొమ్ము పైకి వేసుకొని, అలా లోనికి వెళ్లింది. . .!

"ఏం బావా! అక్కయ్య బాగుందికదూ. .?" జట్కాలో సర్దుకుని, కూర్చుంటూ, రాణ్యం వేసిన మొదటి ప్రశ్న. . .

సిగరెట్టును ప్యాకెట్లోనుంచి తీయబోయి, ఎక్కడ ఈ కొంటెపిల్ల పోయి అక్కకు ఫిర్యాదు చేస్తుందోనని, మరల జేబిలో చల్లగా దాచాను. .! శ్రీమతి ఈమధ్య చేసిన కొత్త రూలింగుల్లో 'నేను సిగరెట్టు మానివేయుటం' ఒకటి!. . .


# పూవు మీ అదృష్టం చెప్పగలదు



నీ భవిష్యత్తులో ఏమి జరుగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయితు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థ యాత్రలు. వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, అకస్మాత్తు ద్రవ్యలాభము మొదలగువానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి.చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయరిడి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (A. W. 13) Jullunder City.**

"ఏం బావా! మాట్లాడ్డం మానివేశావ్. జవాబు చెప్పవేం . . !", రాజ్యం మరోమారు పలకరించింది.

"ఆఁ ఏవీటోలే అమ్మాయి. . ! మీ అక్కను పెళ్లి చేసుకొన్నతర్వాత, జవాబు చెప్పటమూ, మాట్లాడమూకూడ మరిచేపోయాను. . !"

అంటూ విచారం వలకబోసినట్లు, దిగాలు ముఖం వేశాను. . . .

రాజ్యం విరుగబడి నవ్వుతూ,

"పో బావా! ఎప్పుడూ వేళాకోళాలే. . ! మాట్లాడితే, అమాయకునిలా నటించి చంపేస్తావ్. . నిజం చెప్పు బావా! అక్కయ్య కులాసాగా ఉందికదూ. . !", చిలిపి కళ్లల్లో, ఉత్సాహాన్ని ఒలకబోసింది. .

"మీ అక్కయ్య కేం! నీవు రోడ్డు రోలర్ వైతే, మీ అక్కయ్య ట్రాక్టర్‌లా తయారై, నన్ను దున్నేస్తోంది. . . !",

"చాల్లే బావా! మాట్లాడిస్తే నేను చిక్కాను రోడ్‌రోలర్ అంటావు !" బులుబుతనం ఉట్టిపడేట్లు" బుగ్గలు బూరించింది.

"కాదులే అమ్మాయి! నీవు చీపురుపుల్ల. . మీ అక్కయ్య మెగ్నీషియం తీగ. . చాలా!!". . .

"మరి రేడియో కొన్నారటగా! అక్కయ్య జాబు వ్రాసింది. ఏం రేడియో బావా! ఎంత ఖరీదు. . ?".

"ఆఁ. . ఇంతకుముందు బాగా పనిచేసేది. . కని ఎందుకో ఈమధ్య, మీ అక్కయ్య 'కయ్' మని నోరెత్తితే, అదికూడ భయపడి, పెదాలు బిగుసుకపోయినట్లు, "గుర్" మంటూ ఏడుస్తుంది. . ! ఏమనుకున్నావో మీ అక్కయ్యంటే నేనే కాదు, రేడియోకూడా భయం నేర్చుకుంది. . ! ఇక నీవెలాగో వస్తున్నావు .. ఇక మీరిద్దరూ చేరితే, ఇక రేడియో వార్తలు వినవనిలేదు. . మీ రిద్దరూ చేరిఒక సజీవ వార్తాప్రసార కేంద్రమై పోతిరి. .!"

"రోజా అక్కయ్యను ఇలాగే నవ్విస్తుంటావ్ కదూ బావా!" కిలకిలలాడింది పొట్టేశ్వరీ దేవి. . . మరచా! షరా. . .

"రాజ్యం అనే పేరుతో వ్యవహరింపబడే నీదరు ఈ మరదలు ముద్దాయిగారిని "పొట్టి" అని ఎవరూ పిలువకూడదు. . ! బావనగు నేను మాత్రం పిలువవచ్చును. . ఒకవేళ ఎవరైనా అలా పిలిచిన రిజిష్టరు హక్కులు భంగమొనరించిన వా రగుదురు. . "

"అమ్మాయీమణీ! అదియే అంబర చుంబిత ప్రాలేయ రుక్ మండలీ హరిణంబై యొప్పారు మన సౌధరాజంబు . .! ఏయ్ అబ్బాయి. . ఆ పెంకుటిల్లువద్ద ఆపు..!" అంటూ. . బండివాడికి ఇల్లును చూపించాను. బండి ఆగిన శబ్దం ఎప్పుడు వినిందో, శ్రీమతిగారు ముఖం ఇంతచేసుకొని, చెల్లాయిని ఆహ్వానించేందుకు, గుమ్మంవద్ద చిరునవ్వుతో ప్రత్యక్షమైంది.

"అక్కా. . . . ."

"అమ్మాయ్. . ."

చూపుల్లో. . మాటల్లో . . గాఢంగా కౌగిలించుకొని పరిష్వంగానుభూతిని ఇద్దరూ పొందారు. . .

* * *

చిట్టికి నాకు పెళ్లయి, క్రొత్తకాపురం పెట్టినతర్వాత, మరదలుపిల్ల రావటం, ఇదే మొదటిమారు కావటంచేత, బడ్జెట్ భారీగా ఈ విషయంపై, (కృశ్చేవ్ టూర్ వచ్చినప్పుడు ఖర్చుకాలేదూ, అలాగు), ఖర్చుపెట్ట దలచుకొన్నాను. . . !

చిట్టిని మరునటిదినం రహస్యంగా పిలచి, "ఆ అమ్మాయి రాకరాక వచ్చింది! నీ పొదుపరితనం ఈ వారందినాలు అలా కట్టిపెట్టి, అవి ఇవీ స్వీట్సు చేయి. . . ! ఇదిగో. . . !" అంటూ అనుకున్న బడ్జెట్ 50 రూ. ఇచ్చాను.

"మీరు చెప్పనిలేదులెండి!", అంటూ 50 రూ. తీసుకొని, విష్ణుని లోనికి వెళ్లిపోయింది. .

కానీ మూడుదినాలవరకూ, స్వీట్సుకాదు కదా, పాయసంకూడ చేసిన పాపాన పోలేదు. . . విషయం ఎత్తగనే, . .

"మీరు చెప్ప పనిలేదులెండి . .!", అంటూ చిరునవ్వు నవ్వి, ముక్కు పుటాలను ఎగురవేస్తుంది.

మా అక్కయ్య వచ్చినపుడు, రోజాకు ఓ పిండివంట చేస్తూ, రోజా మార్చి రోజా సినిమాకు ప్రయాణం కట్టిన చిట్టి, తన చెల్లాయి వచ్చినపుడు ఇలా వ్యవహరించటం నాకు విచిత్రంగా తోచిందంటే, అబద్ధంకాదు. . .

ఆ దినం మధ్యాహ్నం నాచదువులగదిలో పేపరు ముఖానికి అడ్డుపెట్టుకొని, యాదాలాపనగా పండుకొని యున్నాను.

అక్కా చెల్లెళ్లు ఇద్దరూ, ప్రక్కగదిలో పాచికలాడుతున్నారు. గవ్వలు మాటిమాటికి గల్లుమంటున్నాయి.

"నిజంగా నీవు చిక్కిపోయావు అక్కా. . !", మరదలుపిల్ల కంఠం వినిపించింది.

"అవును, ఆయన కష్టపడి తెస్తే, తిని ఇంటిపట్టున వుండలేక, చిక్కిపోయానంటావు కదూ ! పాపం. ఈమధ్య క్రొత్త సంసారం ఈదటానికి అష్టకష్టాలు పడుతున్నారు !"

"ఛ ఛ...మరి అలాంటి అబ్బాయిగారు పెళ్లి ఎందుకు చేసుకోవాల్నో?" మరదలుపిల్ల ఎదురు దెబ్బ తీసింది.

"కానీవే ! రేపు కాబోయే నీ మొగుడ్ని ఈ ప్రశ్నే అడుగు జవాబు చెప్తాడు !" మాటకు మాటగా జవాబిస్తూ.

చిట్టి గవ్వల శబ్దంలో కలిసిపోయేట్లు ఘల్లుమని నవ్వింది.

"చాల్లే అక్కా ! బావ మాటలు నీకూ ఒంటబట్టినట్లున్నాయ్ ! మరి నేను వచ్చి నాలుగు దినాలు కావొస్తుంది కదా ! తీపు, గీపు చేస్తావా లేక . . . !"

మరదలుపిల్ల సిగ్గు,మొహమాటంలో ఇలాం విషయంలో పట్టించుకోదు !

"అమ్మాయి రాజ్యం! ఇది మీ అమ్మగారి ఇల్లు కాదు, గంటగంటకు అమ్మను పీడించి, ఒక్కోరకం వంటకం తినడానికి ! మేము మీలాగు లక్షాధికారులం కాదు చేసిపెట్టడానికి ! ఏదో ఆయనకు వచ్చే 150 రూ.లో సర్దుకోవాలి తెలుసా !"

చిట్టి ఇలా జవాబిస్తుందని కలలోనూ నే తలపలేదు. నా తల తీసివేసినా బాగుండేది !

"చాల్లేవే అమ్మాయి! సాయంకాలం చేస్తాముగా !" అంటూ చిట్టి మందలించినట్లు మందలించి, టక్కున మాట మార్చింది !

"అవున్లే అక్కా ! మెడలో ఆ మూడు ... ముళ్లూ వేశాడో లేదో, నా వారు, నా ఇల్లు.... ఇవన్నీ అమాంతంగా కావలించుకున్నాయి!మేమంతా 'మీారు, మీా అమ్మగారు' ఇలా ఎవరో పరాయివాళ్లమై పోయాము ! అంతేకదూ !"

"నీకు తెలీదే పిచ్చిపిల్లా! మూడు ముళ్లంటున్నావు ! నిజానికి ఆ మూడు ముళ్లే, మూడు లోకాలు మునుచుకుపోయినా విడిపోవు ! రేపు నీకూ పెళ్లికానీ తెలుస్తుంది ! వారు నా వారు. ఇది నా ఇల్లు ! నేనుకాక వారినీ, ఈ ఇల్లును ఎవరు చూసుకొంటారు ? ఏమన్నా, మీారంతా వచ్చి చూసేవాళ్లే ! భాగ్యం వుంటే ఆనందిస్తారు. లేకుంటే ఛ...అని చస్పరించి మీ దోవన మీారు పోతారు. కానీ, ఆయన కష్టపడాలి, నేను తినాలి ! నేను కష్టపడాలి ఆయన సుఖపడాలి !! ........ !!"

నా చిట్టి చిట్టి బుర్రలో ఇంతపెద్ద పవిత్ర ఆశయం ప్రతిష్ఠించుకొన్నదని తెలుసుకోగానే ఆనందం అశ్రురూపాన, కనుకొనల్లో నిలిచిపోయింది !

"ఆయన కష్టపడాలి, నేను తినాలి! నేను కష్టపడాలి, ఆయన సుఖపడాలి !"

ఎంత సులువుగా దాంపత్యజీవితరహస్యాన్ని విడమరచి చెప్పగలిగింది!

ఏమైతేనేం, మరునాడు తీపి తినిపించింది. సినిమాకు నా బలవంతాన బయులుదేరింది !

* * *

రేపటిదినం మరదలు వెళ్తుందనగా, ఆ విషయాన్ని గూర్చి, ఆ రాత్రి జ్ఞాపకంచేశాను.

"సరేలెండి ! రేపు సాయంకాలంకదా వెళ్లేది చూస్తాం ! ఏం మునుచుకపోదులెండి !"

ఏం పట్టించుకోనట్లు ఆవలించి, ముసుగు తన్ని పడుకొంది.

మరునాటి మధ్యాహ్నం చీరను బేరం చేసేందుకు, చెల్లెలను తీసుకొని వెళ్లకుండా తానొక్కతే బజారుకు వెళ్లటం నాకు విచిత్రంగా తోచింది !

"ఆ అమ్మాయిని కూడ తీసుక వెళ్లు! తాను కోరింది తీసుకుంటుంది !" నేనే ప్రస్తావించాను.

"ఆ పిల్లకేం తెలుస్తుందండీ ! ప్రక్కింటి కృష్ణవేణమ్మగారు వస్తానంది. ఆవిడా, నేను వెళ్లివస్తాం !" అంటూ వెళ్లిపోయింది.

మరదలుపిల్లకు, పోతూపోతూ ఏం చెప్పి పోయిందో కానీ, శ్రీమతి వెళ్ళగానే నన్ను చూసి, "బావా! నీతోనొక మాటడుగుతాను కోప్పడవు కదా !"

ప్రేమపిచ్చిలమ్మైన గొంతుకతో ప్రశ్నించింది.

ఏమన్నట్లు చూశాను.

"మరి అక్కయ్య మమ్మల్నందర్నీ ఈ పది మాసాల్లోనే ఇలా పూర్తిగా మరచిపోవటమే కాదు ఏమాట కొచ్చినా నిన్ను అడ్డువేసుకొని వచ్చి మాట్లాడుతుంది....!

ఏమన్నా వశీకరణమంత్రంవేశావా కొంపదీసి..!

జడకొనకు రిబ్బను చుట్టుకుంటూ, నావేపు చూసి గలగల నవ్వింది.....

"రేపు నీకూ పెళ్ళికానీ... తెలుస్తుంది ఆవశీకరణ మంత్రమేదో....!" అంటూ, నేను జవాబివ్వటంతో, మరదలు ముఖం సిగ్గుతో ఎర్రబడి, క్రిందకు దించేసుకొని, బులబులగా "పో బావా!" అంటూ జడ నొకమారు అద్దంలో చూసుకొని, వంటగదిలోనికి వెళ్ళిపోయింది....

* * *

సాయంకాలం ఆఫీసునుంచి వచ్చేప్పటికే, మరదలు ప్రయాణానికి సిద్ధంగా ఉంది......

"ఈదినం నీవు రావేమోననుకొన్నాను బావా!" అంటు వ్యంగ్యంగా, అలా మాటవిసిరింది.

"ఇంట్లో ఇంతలావు మరదలుపిల్ల ఉంటే, రాకుండా ఉంటే మనస్సు ముందునిలుస్తుందా.!" అంటూ, బూట్ విప్పసాగాను....

కాఫీకప్పుతో గదిలో శ్రీమతిగారు, చిరునవ్వుతో ప్రత్యక్షమై,

"బూటు విప్పుతున్నారే...! రైలు టైం అయింది...! అమ్మాయి రాజ్యం...!" లోనికి కేకవేసింది....

"రెడీ అక్కయ్యా...!" లోననుండి జవాబిచ్చింది మరదలుపిల్ల....!

"ఒకే! కెమెరామాన్ రెడీ... సౌండ్ రెడీ... తారామణి రాజ్యంగారూ... ఇక మేకప్ గదిలోనుండి వెలుపలికి వస్తారా!" అంటూ నేను డైరక్టర్‌లా కంఠం మార్చి పలుకరించాను....

"అబ్బ! మీకు పిచ్చిఎత్తుతుంది నిజంగా! ఎప్పుడూ వేళాకోళాలు...! ఏయ్ రాజ్యం...! వారు చేసే వేళాకోళాలకు, నీవు చేసే ఆలస్యానికి సరిపోయింది.... గబాల్న వచ్చేశెయ్...!"

ఆకుపచ్చని కాలిక్లాత్ చీరకట్టి, రోజారంగు బ్లౌజు, నల్లటి నిగనిగలాడే జడ చివర, ముదురు పసుపుపచ్చ రిబ్బన్ కట్టి, లావుగా, కొంచెం పొట్టిగా, మరదలుపిల్ల ముస్తాబు పూర్తిచేసుకొని వచ్చింది.

ఆకుపచ్చ కాలిక్లాత్ చీర....!

శ్రీమతి మొన్న అమ్మగారి ఇంటినుంచి వస్తూ, ముచ్చటపడి తెచ్చుకున్న చీరల్లో ఒకటి...!

"మరి నీవు బజారునుంచితెచ్చిన చీర ఏదీ?" హఠాత్తుగా సందేహం స్ఫురించి ప్రశ్నించాను.

"పెట్టెలో అన్నీ సర్దుకున్నావు కదా!... జాగ్రత్త పోతుండగనే జాబు వ్రాయి. అంటర్నీ అడిగానాని చెప్పు....!"

నా ప్రశ్నను వినిపించుకొన్నట్లే చెల్లాయిని పరామర్శిస్తుంది. మరోమారు ఉండబట్టలేక ప్రశ్నించాను.

"అబ్బబ్బ ! మా ఆడవాళ్ల చీరల సంగతి మీ కెందుకు? ఏదో ఒకటి కొన్నాము! తెచ్చాను! అది సరేకాని అమ్మాయి... రాత్రిపూట రైలు ప్రయాణం జాగ్రత్త....!"

నా ప్రశ్నకు జవాబును దులిపివేస్తూ ప్రసంగం మార్చింది....

* * *

రాత్రి భోజనాలవద్ద నన్ను మాట్లాడించాలని శ్రీమతి ఎన్నో ఎత్తులు వేసింది.

చెల్లెలకు చీరను కొనకుండా తన చీరల్లోనే ఒకదానిని చుట్టబెట్టి సాగనంపింది.....!

మరి చీరకుగా నేనిచ్చిన రు. 50 — లు ఏం చేసినట్లు ?

ముభావంగా నే నుండటం చూసి కిలకిలా నవ్వింది....!

"ఏమండీ! అలుగు పీఠం వేసినట్లున్నారే! మిమ్మల్నే!" అంటూ పలుకరిస్తున్నా మారు పలుకకుండా డాబాపైకి వెళ్లాను.

చెల్లెలు రాకరాక రావటం తన చీరలలో ఒకదాన్ని ఇచ్చి సాగనంపటం... ఇది నాకేం రుచింపలేదు....! డాబాపై పరుపు వేసుకుని పరుండాను.

పుచ్చ పువ్వుల్లాంటి వెన్నెల...

దొడ్లో టెంకాయ చెట్లపై పక్షి రెక్కలు విరుచుకొన్న శబ్దం!....

శ్రీమతి వంటగది సర్దుకొని క్రింద తలుపులు వేసినట్లు శబ్దం........

చిట్టివచ్చినట్లు గాజుల శబ్దం.....

బల్లమీద మరచెంబునిండా మంచి నీళ్ళు పుంచింది.

మల్లెపువ్వుల్లాంటి తెల్లచీర, జరీఅంచు లేత గులాబిరంగు రవికె......

వెన్నెలలో తేలియాడే అచ్చరలా నావద్దకు మెల్లగా వచ్చింది.

"మిమ్మల్నే!........"

పడకపై తానూ ఒత్తిగిలి కూర్చుంది.

జడలోని నైట్‌క్వీన్ గుప్పుమంటోంది.

మెల్లగా ఆవులించి ఒళ్ళు వయ్యారంగా విరుచుకొని, నావేపు చూసి చిరునవ్వుతో,

"మా కోసం ఇంకా తగ్గలేదా....! మిమ్మల్నే! ఇదిగో చూడండి...! ఈప్యాకెట్టు చూడండి....! మీ రిచ్చిన డబ్బుకే కొన్నాను.....!" అంటూ ప్యాకెట్టు నోదాన్ని నాముందు ఉంచి మెల్లగా విప్పసాగింది.....

చెల్లెలకు తన చీరను ఇచ్చి తాను క్రొత్తచీర కొన్నది గామోసనుకొని,నేనూ సంతృప్తి పడ్డాను.

చిరకాదు.......!

కాటన్‌స్‌పూలు ప్యాంటుగుడ్డ, టెర్లీ షర్టింగులు....

"నీకేనా...?" అంటూ ప్రశ్నించాను,బుగ్గన గిల్లుతూ!

"కాదు....మావారికి....!" అంటూ,సిగ్గుతో కుంచించుక పోతూ, జవాబిచ్చింది......

నే నిచ్చిన డబ్బులోనే నాకు గుడ్డలు కొని తెచ్చింది....!

జడలోని పూలు ఫక్కుమని నవ్వాయి.

ఒంచుకున్న తల కుడివేపు మృదువైనబుగ్గ, వెన్నెలలో, పాల బుడగలా ఉంది.

సన్నగా కొనతేలిన గడ్డం గర్వంగా ప్రకాశిస్తోంది.

చిట్టివాలిన బరువైన కనుబొమలపై, నా పెదాలను స్పృశించాను.

"ఎంతపని చేశావు చిట్టీ! మీ చెల్లాయికి చీర తెమ్మని ఇస్తే, నాకేం అవసరం వచ్చిందని ఈ షర్టింగ్సు తెచ్చావు....?"

అంటూ చిట్టి చిరు గడ్డంపై చిన్న దెబ్బవేశాను.

"నాకు చీరలు బోలెడున్నాయి! వాటిల్లో ఒకటి ఇచ్చాను. మరి మీకు....!" అంటూ నా రొమ్ముపై తన మృదు హస్తాన్ని స్పృశించింది.

"చిట్టీ! నిజంగా నీవు.....నా....!"

తన చూపుడువేలుతో,నాపెదాలను మూస్తూ, బులుపుగా నావేపు కనులెత్తి, బరుగాచూస్తూ... "ముందు మీరు! తర్వాతనే అన్నీ....!", అంటూ నా ఒడిలో తలదాచుకొంది......!

